రేపు పీలేరులో బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలు

ప్రజాశక్తి-పీలేరు

ఈ నెల 25వ తేదీన పీలేరులో పురుషుల విభాగంలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ టీం తరపున ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ వి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఉదయం నుంచి ప్రారంభమయ్యే ఈ టోర్నమెంట్‌లో పాల్గొనడానికి అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు నుంచి ఆసక్తిగల బ్యాడ్మింటన్ క్రీడాకారులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారికి మధ్యాహ్నం, రాత్రి భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విజేతలకు నగదు బహుమతితో పాటు అదనంగా ట్రోఫీ కూడా బహుకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.7 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు, చతుర్థ బహుమతి రూ.3 వేలు ఉంటాయన్నారు. ఈ టోర్నమెంట్లో పాల్గొనదలచిన క్రీడాకారులు రూ.500లు ప్రవేశ రుసుం చెల్లించి, తమ పేర్లను ఈ నెల 24వ తేదీలోగా సెల్ నెంబర్లు : 9849635610, 9652685836కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు.

రైతుల ఆందోళనలపై కేంద్రం తీరు దారుణం

- నిరసనలో ఎపి రైతు సంఘం, సిఐటియు నాయకులు

రాయచోటి : నిరసన తెలుపుతున్న రైతు సంఘం, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రైతులు చేపట్టిన ఆందోళనలపై కేంద్ర ప్రభుత్వం తీరు దారుణమని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు ఖండించారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై బిజెపి ప్రభుత్వం దాడి చేయించడం సరికాదని మర్శించారు. మద్దతు ధర చట్టం చేయమని, రెండేళ్ల క్రితం రైతులకు క్షమాపణలు చెబుతూ మోడీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పోరాటం సందర్భంగా చనిపోయిన రైతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ఢిల్లీ సరిహద్దుల్లో రెండవ దఫా రైతాంగం మొదలుపెట్టిన ఉద్యమంపై హర్యానా బిజెపి ప్రభుత్వం పోలీసులతో కాల్పులు జరిపించడం వల్ల 23 ఏళ్ల యువరైతు మృతి చెందిన ఘటనపై శుక్రవారం ఎపి రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా సమయంలో రైతుల భూములను, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగిస్తూ మోడీ తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త రైతాంగం 15 నెలలు చేసిన పోరాటాలు చేశారన్నారు. అప్పట్లో మోడీ ప్రభుత్వం దేశ రైతాంగానికి క్షమాపణలు చెబుతూ ఇచ్చిన హామీలు మూడేళ్లు గడుస్తున్నా అమలు చేయలేదని చెప్పారు. కాబట్టే రైతాంగం రెండవదఫా పోరాటాలకు దిగాల్సిన పరిస్థితులకు మోడీ ప్రభుత్వమే కారణమని విమర్శించారు. పది ఏళ్ల కాలంలో మోడీ విధానాల ఫలితంగా 1.60 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేసి ఉంటే ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. హర్యానా బిజెపి ప్రభుత్వం ఢిల్లీకి శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న రైతాంగంపైకి పోలీసులను ప్రయోగించి అంతర్జాతీయ సమాజం నిషేధించిన పెల్లెట్స్ వంటి ఆయుధాలను, భాష్పవాయు గోళాలను రైతులపై విసరబట్టే 200 మంది రైతులు గాయపడి, అనేక మంది చూపు కోల్పోయారని, ముగ్గురు రైతులు ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్నారని, శుభ్ కరణ్ సింగ్ అనే 23 ఏళ్ల యువరైతు ప్రాణాలు వదిలాడని, ఇవి సాధారణ మరణాలు కావని, మోడీ ప్రభుత్వ హత్యలని విమర్శించారు. బిజెపి ప్రభుతం రైతాంగ సమస్యలు విస్మరిస్తే భావితరాలు ఆహార సంక్షోభం ఎదుర్కో తప్పదని తెలిపారు. పోలవరంతో పాటు పెండింగ్‌లోని నీటి ప్రాజెక్టుల పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు చెన్నయ్య, మూధవయ్య, పామయ్య, డి.భాగ్య లక్ష్మి, సిద్దమ్మ, సుమలత, భూదేవి, సునందమ్మ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్:** గిట్టుబాటు ధర, న్యాయమైన డిమాండ్ల కోసం రైతులు చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అమానవీయమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్, కాంగ్రెస్ పార్టీ రాజంపేట నియోజకవర్గ బాధ్యులు పూల భాస్కర్ తెలిపారు. పట్టనంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కార్మిక నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతాంగ పోరాటం తీవ్ర స్థాయిలో జరుగుతున్న నేపథ్యంలో పంజాబ్ లో పోలీసులు జరిపిన కాల్పుల్లో 21 ఏళ్ల యువరైతు శుభకరన్ సింగ్ మృతి చెందడం తీవ్ర బాధాకరమని తెలిపారు. మరో రైతు గుండెపోటుతో మృతి చెందడం విచారకరమన్నారు. లక్షలాదిమంది రైతులు పోరుబాటలో ఉన్నా మద్దతు ధర చెల్లిస్తామని, కేసులు ఎత్తివేస్తామని హామీలు గుప్పించిన బిజెపి ప్రభుత్వం హామీల అమలును ఉల్లంఘించి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం బిజెపి నిరంకుశత్వానికి తార్కాణమని తెలిపారు. రైతుల న్యాయమైన హామీలు నెరవేర్చే వరకు వారికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు ప్రసాద్, సురేష్, లక్ష్మణ్, హరి, సుంకన్న, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రాజంపేట : నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాలు, కాంగ్రెస్ నాయకులు

ఫిర్యాదులకు 48 గంటల్లోగా పరిష్కారం : కలెక్టర్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి రాయచోటి

ఎన్నికలకు సంబంధించి మీడియాలో వస్తున్న ఫిర్యాదులకు 48 గంటల్లోగా తగు చర్యలు తీసుకొని పరిష్కరించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో సాధా రణ ఎన్నికలు-2024 పై సంసిద్ధత గురించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి అభిషిక్త్ కిషోర్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన ఫారంలను పెండింగ్లో ఉంచరాదని, వాటిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ సెంటర్లలో ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా వివిధ రాజకీయ పార్టీలతో సమీక్షించుకొని కౌంటింగ్ కేంద్రాలను ఎంపిక చేసుకోవాలన్నారు. పిఒలు, ఏపీవోలు తగినంత మంది ఉండేలా చూసుకోవాలన్నారు. మీడియాలో వస్తున్న ఫిర్యాదులపై వెంటనే తగు చర్యలు తీసుకొని పరిష్కరించాలన్నారు. అనంతరం అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు అనుసరించి అన్నమయ్య జిల్లాలో ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని కలెక్టరేట్ సిబ్బందిని, నోడల్ ఆఫీసర్లను ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించి మీడియాలో వస్తున్న ఫిర్యాదులకు 48 గంటలలో తగు చర్యలు తీసుకొని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్లే సంక్షేమ పథకాల వారధులు : 'మేడా'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

గ్రామ, వార్డు వాలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు వారధులని, వారి సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జునరెడ్డి, ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఆగేపాటి అమర్నాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పురపాలక కార్యాలయం, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలోనూ వేరువేరుగా వాలంటీర్లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అత్యుత్తమ సేవలందించడంతోపాటు విధివిధానాలలో అలసత్వం లేకుండా ప్రజలకు సేవలు అందించినందుకు గానూ వాలంటీర్లను సేవా వజ్ర, సేవారత్న, సేవా మిత్ర పురస్కారాలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంకిత భావంతో సేవలందించిన వాలంటీర్లను సత్కరించుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సచివాలయ, వాలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చి సంక్షేమాన్ని ప్రజల గుమ్మం వద్దకు చేర్చారని, ఈ వ్యవస్థ దేశానికే ఆదర్శప్రాయంగా నిలిచిందని తెలిపారు. నిరంతరం రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం పరితపించే జగన్మోహన్‌రెడ్డి నవరత్నాలు పేరిట కుల, మత, వర్గ భేదం లేకుండా రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, తహశీల్దారు ఇన్బనాథన్, ఎంపిడిఒ మోహనరంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాంబాబు, సచివాలయాల కన్వీనర్ మందరం గంగిరెడ్డి, ఊటుకూరు, ఎంజీపురం ఎంపిటిసిలు నాగ చంద్రశేఖర్‌రెడ్డి, మధుబాబు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వాలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్

కీచక అధ్యాపకుడికి దేహశుద్ధి

పోలీసుస్టేషన్‌లో అప్పగింత

విద్యార్థుల నిరసన

పోలీసుస్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువులు దారి తప్పి విద్యార్థినిల పట్ల వంకర చూపులు చూస్తున్నారు. తల్లిదండ్రులు ఎంతో విశ్వాసంతో తమ పిల్లల్ని విద్యాభ్యాసానికి పంపిస్తే దైవసమానులైన గురువులే ఆడపిల్లల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తుంటే తమ పిల్లలకు సమాజంలో రక్షణ ఎక్కడ దొరుకుతుందో తెలియక తల్లిదండ్రులు నిస్సహాయ స్థితిలో ఉండిపోతున్నారు. పట్టణ శివారులోని నారాయణాద్రి ఇంజినీరింగ్ కళాశాలలో ఓ అధ్యాపకుడు ఆడపిల్లల చదువు బాధ్యత తనదేనంటూ నమ్మించి దత్తత తీసుకుంటానంటూ నమ్మబలికి ఆపై ఆడపిల్లల పట్ల వేధింపులకు పాల్పడుతుండడంతో విద్యార్థులంతా ఏకమై అధ్యాపకుడికి దేహశుద్ధి చేసిన ఘటన శుక్రవారం రాజంపేటలో చోటు చేసుకుంది. నారాయణద్రి ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న జయ ప్రకాష్ నారాయణ పేద విద్యార్థినులను దత్తత తీసుకొని చదివిస్తానని నమ్మించి ఆపై వారితో అసభ్యంగా ప్రవర్తిస్తూ వెకిలి చేష్టలకు పాల్పడుతుండడంతో విద్యార్థులంతా ఏకమై అధ్యాపకుడికి దేహశుద్ధి చేసి రూరల్ పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. చాలా కాలంగా విద్యార్థినిల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడని పలువురు విద్యార్థినిలు ఆరోపిస్తున్నారు. శుక్రవారం కూడా ఒక అమ్మాయితో అలానే ప్రవర్తించడంతో విద్యార్థులు దేహశుద్ధి చేశారు. అమ్మాయిలను వాడుకోవడం ఒక కళ అని, తాను న్యాయవాది కూడా కావడం వలన పోలీసులు కూడా తననేమీ చేయలేరని విద్యార్థులతో చెప్పినట్లు తమ వద్ద వాయిస్ రికార్డులు కూడా ఉన్నట్లు విద్యార్థులు తెలుపుతున్నారు. కీచక అధ్యాపకుడికి తగిన శిక్ష పడి అలా ప్రవర్తించే వారికి ఓ గుణపాఠం కావాలని కోరుతూ శుక్రవారం విద్యార్థులు రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద ప్రధాన రహదారిలో బైఠాయించి నిరసన తెలిపారు. పలు విద్యార్థి సంఘాల నాయకులు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని తమ సంఘీభావం తెలియజేసి కేసు నమోదు చేసి అధ్యాపకుడికి శిక్ష పడాలని డిమాండ్ చేశారు.

'మిట్స్'ను సందర్శించిన ఎన్‌సిసి ఎడిజి

విద్యార్థులతో ఎన్‌సిసి అధికారులు

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలను ఆంధ్రప్రదేశ్, తెలంగానణ ఎన్‌సిసి అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ వి.ఎం.రెడ్డి సందర్శించారని ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. కళాశాలలోని ఎన్‌సిసి క్యాడెట్స్‌ను ఉద్దేశించి వి.ఎం.రెడి మాట్లాడుతూ విద్యార్థులలో ధైర్యసాహసాలు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, లౌకిక ధృక్పథం, సాహసం, క్రీడాస్ఫూర్తి, నిస్వార్థ సేవా భావాలు పెంపొందించబడటానికి ఎన్‌సిసి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అందుకోసమే ఎన్‌సిసి విద్యార్థులను పాఠశాల దశ నుంచే సైన్యంలో చేరేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. క్రమ శిక్షణతో కూడుకున్న ఎన్‌సిసి శిక్షణ క్యాడెట్లలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. అంతకు ముందు ఎన్‌సిసి క్యాడెట్లతో గౌరవవందనం స్వీకరించారు. తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ఎంతో మంది క్యాడెట్స్ దేశంలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని ఎంతో ఘనత సాధిస్తున్నారని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 1.25 లక్షల మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. యువతలో సైన్యం పట్ల అవగాహన కల్పించేందుకు, సైనిక స్థాయిలో వారిని సిద్ధం చేసేందుకు ఎన్‌సిసి ఏర్పడిందని పేర్కొన్నారు. శిక్షణా సమయంలో విద్యార్థులకు డ్రిల్, షూటింగ్, ఫిజికల్ ఫిట్నెస్, మ్యాప్ రీడింగ్, ఫస్ట్ ఎయిడ్, గ్లైడింగ్, బోట్ పుల్లింగ్, సెయిలింగ్‌తో పాటు క్యాంప్ ట్రైనింగ్‌లో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ అవసరాలకు తగ్గట్లు ప్రాథమిక సైనిక శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. వీటిపై విద్యార్థులకు అవగహన పెంచి, విద్యార్థులలో ఎన్‌సిసిపై చైతన్యం నింపి ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీ కి తగ్గట్టుగా ఎన్‌సిసి క్యాడెట్స్‌కు ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్, డ్రోన్ టెక్నాలజీ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ రంగాలల్లో, దేశ రక్షణకు కావలిసిన పరిశోదనలు చేసే వీలు కూడా కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఇంటెర్న్‌షిప్ రూపంలో ఇస్రో, డిఆర్‌డిఒ లాంటి సంస్థలో అవకాశాలు కూడా ఇస్తున్నాయని ఆయన గుర్తుచేశారు. బి.టెక్ చదువుతున్న ఎన్‌సిసి క్యాడెట్స్‌కు ఎస్ఎస్‌బి, ఎన్‌సిసి స్పెషల్ ఎంట్రీ స్కీం ద్వారా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మిట్స్ ఎన్‌సిసి క్యాడెట్స్ సాధించిన విజయాలకు ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, లెఫ్ట్ నెంట్ డాక్టర్ నవీన్ కుమార్, అధ్యాపకులు, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి సతీష్‌కుమార్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎంపిపి

ప్రజాశక్తి-పీలేరు

ప్రజా సమస్యల పరిష్కారం, మండల అభివృద్ధి కోసం ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధి, అధికారి కృషి చేయాలని పీలేరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కంభం సతీష్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలో ప్రజా ప్రతినిధుల నుంచి అందిన పలు సామాజిక సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. ముఖ్యంగా రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు కృషి చేయాలని తెలియజేశారు. సమావేశంలో జడ్‌పిటిసి ఏటి రత్నశేఖర్‌రెడ్డి, ఎంపిడిఒ ఉపేంద్ర, ఇఒపిఆర్‌డి గఫూర్, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఎంపిటిసిలు, సర్పంచులు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

వైసిపిని ఒడించడమే లక్ష్యం : ఆర్ఆర్

ప్రజాశక్తి-సంబేపల్లి (రాయచోటి)

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపిని ఓడించేందుకు నియోజకవర్గంలోని కార్యకర్తలు పని చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సంబేపల్లి మండలం గుట్టపల్లిలో ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పక్క పార్టీ నుండి వచ్చి టిడిపిని కబ్జా చేయాలని ప్రయత్నం చేస్తున్నారు అన్నారు.వైసిపి నుండి వలస వచ్చిన నాయకుల వెంట నిలుస్తారా కష్టకాలంలో పార్టీని నమ్ముకున్న వారిని వదలకుండా నిలబడ్డ వ్యక్తి వెంట నడుస్తారా అలోంచిచాలన్నారు. రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారంటీ నియోజకవర్గ ప్రజల భవిష్యత్తుకు నేను గ్యారంటీ కార్యక్రమంలో ప్రతి గ్రామాన్ని 90 శాతం తిరిగానన్నారు. టిడిపి సుగవాసి పాలకొండ్రాయుడు తరువాత 2014 నుంచి నేటి వరకు పార్టీ బరువు భాద్యలు బుజస్కందాలపై మోసిన వ్యక్తిని నేనేనని పేర్కొన్నారు. మీరంతా పార్టీ గెలుపు కోసం పనిచేసే కార్యకర్తలు, నాయకులే కాదు నా ఆత్మీయ బంధువులని తెలిపారు. చంద్రబాబు చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని గడప గడపకు తిరిగి ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్‌టిసి నర్సారెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు రెడ్డి యాదవ్, సుబ్బరాజు యాదవ్, భాస్కర్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ కాలాడే ప్రభాకర్ రెడ్డి, రాయచోటి టౌన్, రూరల్ అధ్యక్షులు బోనమల ఖాదర్ వల్లి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అభ్యసనాభివృద్ధిని పరిశీలించిన రాష్ట్ర బృందం



అభ్యసనాభివృద్ధి కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం

ప్రజాశక్తి-పీలేరు

అభ్యసనాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సుష్మా కార్య క్రమాన్ని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలక బృందం పరిశీలించింది. శుక్రవారం పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని డాక్టర్ రామకృష్ణ నేతృత్వంలో గణితం పరిశీలికులు కె.రాజేంద్రప్రసాద్, తెలుగు పరిశీలకులు జిసి నాగప్ప, సోషల్ పరిశీలకులు డి.బాబా సాహెబ్ బృంద సభ్యులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు 6, 7, 8వ తరగతుల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు, విద్యార్థుల కనీస పఠనా సామర్థ్యం, ఉపాధ్యాయుల బోధనా అంశాలు, భాషా నైపుణ్యం, రికార్డులను పరిశీలించారు. అనంతరం రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ ఎస్.రామకృష్ణ పాఠశాల బోధన సిబ్బంది సమావేశంలో మాట్లాడుతూ తమ పరిశీలనతో విద్యార్థుల అభ్యసన సామర్థ్యం, చురుకుదనం సంతృప్తికరంగా ఉందని ప్రశంసించారు. తరగతి గదిలో వెనుక బడిన విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు చేపట్టాల్సిన బోధన, కార్యాచరణ ప్రణాళిక గురించి సమీక్షా సమావేశంలో వివరించారు. విద్యార్థులకు సహ పాఠ్యాంశాలైన పచ్చదనం పరిశుభ్రత, చిత్ర లేఖనం, రంగులు వేయడం, చేతిరాత తదితర అంశాలలో తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. బోధనా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పాఠ శాల సిబ్బంది ఆధ్వర్యంలో రాష్ట్ర పరిశీలక బృందానికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజి నట రాజ, ఎంఇఒ లోకేశ్వర్ రెడ్డి, ఎంఇఒ-2 పద్మావతమ్మ, సిఆర్‌పి మురళీధర్ రాజు, పాఠశాల బోధనా సిబ్బంది ఆర్.శిరీష, (గణితం), శశిదేవి (తెలుగు), ముని వెం కట్రామయ్య, లీలావతి (సాంఘిక శాస్త్రం), మోదీన్ బాష, వై.రమణారెడ్డి, పి.షరీ ఫున్నిసా, బి.రాజన్న, సురేష్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సి కోసం పోరాడితే అరెస్టులా? : డిసిసి

ప్రజాశక్తి-రాయచోటి

మెగా డిఎస్‌సి కోసం పిసిసి చీఫ్ షర్మిల పోరాటం చేస్తే అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని డిసిసి అధ్యక్షులు షేక్ అల్లాబకష్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దగా డిఎస్‌సి వద్దు మెగా డిఎస్‌సి విడుదల చేయాలని కోరుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం కాంగ్రెస్ నాయకులు పోరాడుతుంటే అక్కడికక్కడే అక్రమ అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన రాజకీయ పార్టీలు త్వరలో భూస్థాపితమవుతాయని చెప్పారు. 26వ తేదీన జిల్లా కేంద్రం అనంతపురంలోని జూనియర్ కళాశాలలో జరుగు 'న్యాయ నిర్మాణ సభ'ను జయప్రదం చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు, కాంగ్రెస్ ప్రజానీకానికి పిలుపునిచ్చారు. ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ముఖ్య అతిథులుగా, ప్రత్యేక ఆహ్వానితులుగా సిడబ్ల్యూసి సభ్యులు డాక్టర్ రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతం హాజరవుతున్నారని చెప్పారు. అన్నమయ్య జిల్లాలోని అన్ని నియోజకవర్గాల, పట్టణ, మండలాల నాయకులు తమ బృందాలతో భారీ స్థాయిలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్, జిల్లా ఉపాధ్యక్షులు దర్బార్ బాష, జిల్లా జనరల్ సెక్రెటరీ పటాన్ మహమ్మద్ అలీ ఖాన్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు అమీర్‌బాష, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ, పట్టణ అధ్యక్షుడు ఖాదర్ ఖాన్, మండల అధ్యక్షులు జాఫర్, నూరుల్లా, వెంకటసుబ్బయ్య, ఇతరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు అల్లాబకష్

టిడిపిలో చేసిన వైసిపి నాయకులతో రాంప్రసాద్‌రెడ్డి

టిడిపి గెలుపులో యువత పాత్ర కీలకం : 'మండిపల్లి'

ప్రజాశక్తి-రాయచోటి

తెలుగుదేశం పార్టీకి గెలుపునకు యువత పాత్ర కీలకమని టిడిపి నియోజకవర్గ నాయకులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం రాయచోటి ఎస్.ఎన్.కాలనీలోని మండిపల్లి భవన్ టిడిపి కార్యాలయంలో గొర్లముదివేడు గ్రామం గుట్టకింద హరిజనవాడకు చెందిన యువత మడితాడి మహేష్, నాగేంద్ర, సుధాకర్, అంజి చరణ్, సాయి, వెంకటేశ్వర్లు, నాగార్జున, ఎల్లయ్య మరి కొంతమందిని రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాంప్రసాద్‌రెడ్డి కండువాలు కప్పి సాదరంగా తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో టిడిపి జెండాను ఎగరవేయడానికి యువత సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

'ఆదిత్య'కు న్యాక్ ఎ గ్రేడ్ గుర్తింపు

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లి సమీపంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలను ఈ నెల 16, 17వ తేదీలలో న్యాక్ బృందం పర్యటించి ప్లేస్మెంట్ సెల్, యోగా సెంటర్, కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్, యాంటీ ర్యాగింగ్ సెల్, లైబ్రరీ, స్పోర్ట్స్, జిమ్ సెంటర్, కళాశాల మేస్, హాస్టల్స్, కళాశాల తరగతి గదులను, లేబరేటరీలను సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులతో సంభాషించి సంతృప్తి చెందారని డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. తరువాత పూర్వ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సంభాషించారు. వివిధ రికార్డులను పరిశీలించి విద్యార్థుల అభ్యున్నతి కోసం కళాశాల యాజమాన్యం ఎంతో శ్రమిస్తుందని సంతృప్తి చెందారన్నారు.. కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సంస్కృతిక కార్యక్రమాలను తిలకించి అభినందించారు. చివరగా కళాశాల అధ్యాపకులు మరియు సిబ్బందిని కలసి బోధనా పద్ధతులు బాగున్నాయని అభినందించారు. తత్ ఫలితంగా శుక్రవారం నేషనల్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ వారిచే తమ కళాశాలకు ఎ+గ్రేడ్ గుర్తింపును ఆమోదించారన్నారు. ఎ+ గ్రేడ్ గుర్తింపుతో కళాశాల చైర్మన్ ఆర్.రామ్మోహన్ రెడ్డి, ప్రెసిడెంట్ ఎన్.నాగ మల్లారెడ్డి, కళాశాల డైరెక్టర్ డాక్టర్.ఎస్ రామలింగారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం వివిధ విభాగాధిపతులు, అధ్యాపక బృందం, విద్యార్థులను అభినందించారు.

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజలకు సేవ చేయడం వరం : డాక్టర్

ప్రజాశక్తి-కలకడ

గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు చేయడం దేవుడిచ్చిన వరం లాంటిదని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.వి.కిషోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎం.వి కిషోర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం గురించి వైద్యాధికారి మాట్లాడుతూ నిరుపేదలకు ప్రతి గ్రామంలో వైద్యశాల అందించడం గ్రామ ప్రజలకు ఇది ఒక వరం లాంటిదని అన్నారు. యాభై ఏళ్లుపైబడిన వారికి బిపిలు, షుగర్‌వ్యాధులు. కిడ్నీ వ్యాధులు, పెరాలసిస్ వ్యాధులు, అంగవైకల్యం కలిగిన వారికి ఈ ఫ్యామిలీ పిజిషన్ కార్యక్రమం బాగా ఉపయోగపడుతుందని తెలిపారు. మొత్తం 92 మంది రోగులను పరీక్షించి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. వైద్యాధికారి చెరువు ముందరపల్లెలో కొత్త న్యూ ల్రెపసికేషన్ సందర్శించి మందులు ఎలా పంపిణీ చేస్తున్న తీరును, వాటి వివరాలు అక్కడ ఎంఎల్‌హెచ్‌పి లావణ్యను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఇఒజి జయరామయ్య, ఎంఎల్‌హెచ్‌పిబి అశ్విని ఆరోగ్య కార్యకర్తలు, బి.లక్ష్మి, శివప్రసాద్‌బాబు, డిటి రోజా, పైలెట్ రమేష్‌బాబు, ఆశకార్యకర్తలు ఎం.రామలక్ష్మిబాయి పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

పాఠశాల విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపల్ కెఎస్ఎన్ మూర్తితో కలసి విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం వలన అనారోగ్యానికి గురికాకుండా ఉంటారని అన్నారు. ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రపరచుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడం వంటివి అలవాటు చేసుకోవాలని అన్నారు. పౌష్టిక ఆహారంలో భాగంగా కోడిగుడ్డు, పాలు, ఆకుకూరలు, కూరగాయలు విద్యార్థిని విద్యార్థులు ప్రతిరోజు తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. తద్వారా విద్యార్థులలో రక్తహీనత లోపాలను అధిగమించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సమీపిస్తున్న తరుణంలో, పరీక్షల సన్నధానికి ఎక్కువ సమయం కేటాయించవలసి వస్తుందని, ఇందుకు శరీరానికి పౌష్టిక ఆహారం తీసుకోవలసి ఉందన్నారు. తద్వారా పరీక్షల సమయంలో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటూ పరీక్షలను రాయగలరని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఎండలో తిరిగితే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని, ఎండలో తిరగవద్దని తెలిపారు. తాగునీరును తగిన మోతాదులో తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బిఎల్‌ఒలతో మాట్లాడుతున్న తహశీల్దార్ నరసింహకుమార్

బిఎల్‌ఒలు ఎన్నికలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాబోయే ఎన్నికలకు సంబంధించి బిఎల్‌ఒలు సిద్ధంగా ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి లీలారాణి అన్నారు.శుక్రవారం తహశీల్దార్ కార్యాలయ సమావేశం మందిరంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల బిఎల్‌ఒ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పొప్పులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందే ఓటర్ల జాబితా సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.అనంతరం పుల్లంపేటతహశీల్దార్ నరసింహకుమార్ బిఎల్‌ఒలకు శిక్షణ ఇచ్చారు.

వ్యాధిగ్రస్తునికి రూ.25 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని చిన్నఒరంపాడు గ్రామ పంచాయతీ కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న రేఖలకుంట రమణయ్య కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం ముక్కా రూపనందరెడ్డి ఫౌండేషన్ అధినేత తనయుడు టిడిపి యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి కుటుంబ సభ్యులకు అందించారు. ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని భరోసానిచ్చారు. పేదలకు సేవ చేయడం గొప్ప గొప్ప భాగ్యమని తమ చేతనైనంత వరకు పేదలకు సాయం అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఫౌండేషన్ సేవలపై ఆనందం వ్యక్తం చేశారు. రూపానంద్‌రెడ్డి కుటుంబ సభ్యులు నియోజకవర్గంలో పేదలకు అండగా నిలుస్తూ, అనారోగ్యంతో ఉన్న ఆసరాగా నిలుస్తూ సేవలు అందిస్తు న్నారని కొనియాడారు. కష్టంలో ఉన్న పేదలను గుర్తించి ఆర్థిక సాయం అందిస్తూ దాతృత్వాన్ని చాటుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో చిన్నఒ రంపాడు సర్పంచ్ తనయుడు గద్దె పెంచలయ్య, ముక్కావారిపల్లి సర్పంచ్ ఆరవ శ్రీధర్, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, చింతు రాజారెడ్డి, నారపరెడ్డి రాజారెడ్డి, రేకుల కుంట నరసింహ, తిరుపాల్, కృష్ణయ్య, నారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాధితులకు చెక్కును అందిస్తున్న సాయివికాస్‌రెడ్డి

In The Court of The Prl. Junior Civil Judge:Dharmavaram

O.S. No: 289/2019

Between:
Y.Pothi Reddy ...Plaintiff
And
V.Praveen Kumar Reddy ...Defendant

Notice to Defendant

To:V.Praveen Kumar Reddy S/o Venkataramana Reddy, R/at Flat No:102, Brundavan Apartments, Reddys Colony, Madanapalli Village and Mandal, Chitoor Dist.

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 22-04-2024వ తేది ఉదయం 10:30 గంllలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
M.P.SUBBA RAO,
D.ABDUL SAB,
ADVOCATES, DHARMAVARMU.
CELL:9440018867

LOSS OF DOCUMENTS

I Sayed Hafeezulla S/o Syed Abdul Saheb, #7-605, Indiramma Colony, Kalikiri Village & Mandal, Annmayya Dt. AP-517234, Here with decla re that I have lost original sale deed documents bearing no"s 629/1999, 791/2007 at my house shifting, If any one found please contact above address. Today onwards I used to certificates copies sale deed document s for my property tra nsaction.If any one found and used that above original documents become illegal and void tra nsaction and my self taking loan from "VERITAS FINANCE" Mada napalle Branch by pledging my C/copy of sale deed Doc.No: 629/1999 & 791/2007.

మహిళలకు భరోసా వైఎస్ఆర్ ఆసరా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పెద్దమండ్యం

వైఎస్ఆర్ ఆసరా మహిళలకు భరోసాగా నిలుస్తోందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నాలుగో విడత ఆసరా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు కలిచర్ల సొసైటీ బ్యాంక్ చైర్మన్ కడప సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలను సామాజికంగా, ఆర్థికంగా ఆదుకోవాలన్నదే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని అన్నారు. సిఎం జగన్ పాదయాత్రలో డ్వాక్రా రుణామాఫీ ఇచ్చిన హామీ మేరకు నాలుగు విడతల్లో వైఎస్ఆర్ ఆసరా కింద రుణమాఫీని చేశారని అన్నారు. నగదును నేరుగా మహిళల ఖాతాలో చేమ చేశారని చెప్పారు. మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారని అన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేయడం ఘనత సిఎంకే దక్కుతుందని అన్నారు. వాలంటీర్ వ్యవస్థతో సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందిస్తున్నారని అన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వాలంటీర్లు వారధిగా నిలిచి సేవలు అందిస్తున్నారన్నారు.అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకా లను అమలు చేస్తున్నామని అన్నారు. వాలంటీర్ల సేవలను గుర్తింపుగా వారిని సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, ఏరియా కో-ఆర్డినేటర్ సురేష్ కుమార్ రెడ్డి , ఎంపిపి పూర్ణచంద్రిక, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేసిన పథకాలు వివరించారు. అనంతరం ఉత్తమ వాలంటీర్లకు పురస్కారాలు అందించారు.సిఎం జగన్‌ను మరోమారు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటరమణయ్య, ఇఒఆర్‌డి శ్రీధర్‌రావు, జనార్ధన, జడ్పిటిసి పీరమ్మ, దొరస్వామి, వైస్ ఎంపివో చంద్ర రెడ్డి, శారదమ్మ, రాజంపేట పార్లమెంటు కార్యదర్శి నజీర్ అహ్మద్‌లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

వాలంటీర్‌కు సేవాపురస్కారం అందిస్తున్న ఎమ్మెల్యే

ఆదర్శ పాఠశాలలో అభ్యసన బృందం తనిఖీ

రికార్డులు పరిశీలిస్తున్న అభ్యసనా బృందం సభ్యులు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాలను శుక్రవారం రాష్ట్రస్థాయి అభ్యసనా అభివృద్ధి కార్యక్రమం కమిటీ బృందం తనిఖీ చేసింది. తనిఖీ అధికారి రామకృష్ణ బృందం ఇందులో పాల్గొని ఉపాధ్యాయుల రిజిష్టరు, రికార్డులు, పరీక్షా పత్రాలు, టీచర్ల లెసన్ ప్లాన్‌లు, టీచింగ్ పీరియడ్స్, తరగతిగదులను పరిశీలించారు. విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.అభ్యసన బోధన అంశాల తీరును విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసు కున్నారు. ఉపాధ్యాయులను సమావేశపరిచి బోధన విద్యార్థులకు సులభ రీతిలో బోధించాలని విద్యార్థుల వైయుక్తిక భేదాలను దృష్టిలో పెట్టుకొని పాఠ్యాంశ బోధన జరగాలని సూచించారు. విద్యార్థుల ఉత్తమ ఫలితాలకు ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మలంషావలి ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన రేషన్ కార్డులు మంజూరు

ప్రజాశక్తి- బి.కొత్తకోట

నగర పంచాయతీ పరిధిలోని ఒకటో సచివాలయం పరిధిలో రేషన్ కార్డులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులకి కన్వీనర్ గుమ్మడికాయలు చాంద్ భాషా 25 కొత్త రేషన్ కార్డులు చేయించినట్లు పేర్కొన్నారు. శుక్రవారం నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్, లబ్ధిదారులకు ఈ కార్డులను అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు డి.రేవతి,పి.మాధవి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అర్హత ఉన్న రేషన్ కార్డులు రాలేదని,ఈ ప్రభుత్వంలో రేషన్ కార్డు లేదని ఒకటో సచివాలయంచాంద్ భాషాకి తెలపడంతో ఈ విషయాన్ని మాజీ ఎంపిపి ఖలీల్ అహ్మద్ దృష్టికి తీసుకెళ్లి లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డు మంజూరు చేయించారని తెలిపారు. అనంతరం కన్వీనర్ చాంద్ బాషా మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతివారికి సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అందజేస్తున్నారని, స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో నగర పంచాయతీ అకౌంట్ ఆఫీసర్ రమాదేవి, ఎఇరాజేంద్ర, వైసిపి మాజీ పట్టణ అధ్యక్షుడు జాఫర్ బాషా, నాయకుల సచివాలయ సిబ్బంది మౌలా, విఆర్‌ఒ అమర్ నారాయణ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందిస్తున్న కమిషనర్ పి.ఆర్ మనోహర్

జీవ రసాయనాలతో పంటలకు పోషకాలు

జీవరసాయన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం పరిధిలో ఉన్న అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో రైతులకు ఇన్‌పుట్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి ఎస్‌సి సబ్‌ప్లాన్ ప్రాజెక్ట్‌లో ఎంపిక చేసిన 20 మంది రైతులకు జీవ రసాయనాలు, ప్రెషర్ కుక్కర్స్, మాస్కులు, గ్లౌజ్‌లు, ద్రవ, ఘన జీవన ఎరువులు, ఇతర పరికరాలను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఆన్‌లైన్ ద్వారా డీన్ డాక్టర్ ఎఎస్ పద్మావతమ్మ మాట్లాడుతూ జీవరసాయన ఎరువులతో పంటలకు పోషకాలు పెరుగుతాయని, సమృద్ధిగా పంట చేతికి వస్తుందని అన్నారు. బయో ఫర్టిలైజర్స్ ఆవశ్యకత వివరించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ కె.గోపాల్ మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో జీవ రసాయనాలు ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. కళాశాలలోని అధ్యాపకుల సలహాలు తీసుకుంటూ ఎక్కువ పరిమాణంలో జీవన ఎరువులు తయారు చేసుకొని మంచి దిగుబడులు సాధించాలన్నారు. జోనల్ రీసెర్చ్ హెడ్ డాక్టర్ కెటి.వెంకటరమణ ఎస్‌సి సబ్ ప్లాన్ ఆవశ్యకత, నిధులు పొందే విధానాన్ని వివరించారు. పరిశోధన ప్రాజెక్ట్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ వై.శిరీష మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ ద్వారా చేపట్టే కార్యక్రమాలు వివరించారు. 2022-23 సంవత్సరానికి భారత వ్యవసాయ పరిశోధన మండలి రూ 4.75 లక్షలు అందించిందన్నారు. ఈ నిధులతో కోడూరు, ఓబులవారి పల్లె మండలాల నుంచి ఎంపిక చేసిన 20 మంది రైతులకు 'తక్కువ ఖర్చుతో జీవ రసాయనాల ఉత్పత్తి అనే అంశంపై ప్రాజెక్ట్‌లో భాగంగా యేడాది పొడవునా అనేక కార్యక్రమాలు చేపట్టినటు తెలిపారు. జీవ రసాయనాల తయారీ, వర్మీ కంపోస్ట్ తయారీపై రూపొం దించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం రైతులకు జీవన ఎరు వులు, జీవరసాయనాలు, ఇతర ఇన్‌పుట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ వై.శిరీష, అధ్యాపకులు పి.శ్యాంసుందర్‌రెడ్డి, కె.లలిత, వై.దీప్తి కిరణ్, సయ్యద్ సదరున్నీషా, శారద, ఎం.జయపద్ర, ఎం.హర్షిత పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని గోవిందంపల్లె పరిధిలో శుక్రవారం డాక్టర్ ముద్దా రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో రెండవ విడత జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలల్లో కొన్ని వేల వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు మెరుగైన వైద్యం అందిస్తోంతని తెలిపారు. ప్రభుత్వ వైద్యులు ప్రతి ఇంటికి వెళ్లి వాళ్ళ ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వారికి మెరుగైన వైద్యం అందజేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేజ్-2లో ఇంటి వద్దకే ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్నికలకు యంత్రాంగం సమాయత్తం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఎన్నికలు సమీపిస్తున్న వేళ అందుకు పోలీసు యంత్రాంగం సమాయత్తమవుతోంది. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వివరాలను సిఐ సూర్యనారాయణ ఆదేశాల మేరకు శుక్రవారం ఎఎస్ఐ బొజ్జ నాయక్ నమోదు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో పోలింగ్ కేంద్రాలు బాధ్యత తనకు అప్పగించినట్లు తెలిపారు. ఎన్నికల వేళ పోలింగ్ బూత్ వివరాలు నమోదు చేసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

టిడిపిలో 25 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని కదిరాయ చెరువు పంచాయితీ కదిరాయ చెరువు, కె .వడ్డీపల్లి, బొంతలవారిపల్లి గ్రామాలకు చెందిన సుమారు 25 కుటుంబాలు వైసిపి నుంచి సర్పంచ్ కె.లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న అరాచకాలకు, తట్టుకోలేక మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇస్తున్న మేనిఫెస్టోకు ఆకర్షితులై టిడిపిలో చేరినట్లు తెలిపారు.కలికిరి మండలం నగిరిపల్లెలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారని సర్పంచ్ తెలిపారు.

టమోటా పంటకు నిప్పు పెట్టిన ఆకతాయిలు

ప్రజాశక్తి-గాలివీడు

చేతికొచ్చిన టమోటా పంటను ఆకతాయిలు తగులపెట్టారని మండల పరిధిలోని గోరాన్ చెరువు పంచాయతీ కరిమిరెడ్డిగారిపల్లి చెందిన కసిరెడ్డి వెంకటశివారెడ్డి అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు ఎకరాల టమోటా పంట సాగులో ఐదు లక్షల రూపా యలు పెట్టుబడి పెట్టి సాగు చేశారని, శుక్రవారం కాపు కోయల్సి ఉండాలి ఆకతాయిల చేష్టల వలన టమోటా పంట అగ్నికి ఆహుతి అయిపోయిందని అన్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు.

సుఖ వ్యాధులపై అవగాహన

గాలివీడు : సుఖ వ్యాధులపై ప్రజల్లో చైతన్యం రావాలని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బస్టాండులో కళాజాత బృందం ద్వారా వీధి నాటకం ద్వారా ప్రదర్శనలు ద్వారా అవగాహన కల్పించారు. జిల్లా రెండు కళాజాత బృందాల ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్, రక్తదానం, సుఖ వ్యాధులపై వీధి నాటకాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించి వారిని చైతన్యతులుగా చేశారు. కండోమ్ ఉపయోగం, ఐసిటిసి కౌన్సిలింగ్ కేంద్రాల గురించి, క్షయ వ్యాధి సంబంధం గురించి వివరించారు. కార్యక్రమంలో రాయలసీమ జానపద కళాబృందం కెసి నటరాజు, ఎల్‌డబ్ల్యూ షాప్ అలావలి, నాగేశ్వరమ్మ, కళాకారులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో టిడిపి జెండా ఎగురవేస్తాం

ప్రజాశక్తి-ములకలచెరువు

జయచంద్రారెడ్డికి స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

తంబళ్లపల్లె టిడిపి టిక్కెట్ ఆశావహులు జయచంద్రారెడ్డి శుక్రవారం నియోజకవర్గంలో పెద్ద ఎత్తున వాహనాల ర్యాలీ నిర్వహించారు. హైదరాబాదులో చంద్రబాబును కలిశానని నియోజక వర్గ బాధ్యతలు తనకు అప్పగించినట్లు జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తొలిసారిగా బెంగళూరు ఎయిర్ పోర్ట్ నుంచి మదనపల్లె ద్వారా నియోజక వర్గంలో అడుగుపెట్టిన సందర్భంగా కేడర్, నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కర్ణాటక ప్రాంతం లోని తాడిగోళ్ళ క్రాస్, చీకలి బైలు, తంబల్ల పల్లి నియోజక వర్గ సరిహద్దు అమ్మచెరువు మిట్ట వద్ద నుండి ఆంగళ్లు, పత్ర వారిపల్లి, గట్టు,బి. కొత్తకోట, మొలకలచెరువు వరకు పెద్ద ఎత్తున కార్లు ,భారీ సంఖ్యలో టిడిపి కార్యకర్తలు ,అభిమానుల మధ్య ర్యాలీ నిర్వహించారు. జయచంద్రారెడ్డికి బాధ్యతలు ఇవ్వడంతో పార్టీశ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా అంగళ్లలో జయచంద్రారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జిగా చంద్రబాబు బాధ్యతలు అప్పగించారని అన్నారు. అన్నమయ్య జిల్లాలోనే భారీ మెజార్టీతో ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమం కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకునేందుకు నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు. తంబ ళ్లపల్లె గడ్డపై టిడిపి జెండాను ఎగురవేస్తామ న్నారు.కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

నాణ్యత ప్రమాణాలపై అవగాహన

ప్రజాశక్తి-రామాపురం

నాణ్యత ప్రమాణాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని కస్తూర్బా బాలికల పాఠశాల ఎస్ఒ పుష్పలత అన్నారు. స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో బిఐఎస్ క్లబ్ ఏర్పాటు చేసిన నాణ్యత ప్రమాణాల పైన శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ పై స్టాండర్డ్ విజయవాడ వారి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వస్తువులు నాణ్యత ప్రమాణాలపై, వినియోగదారుల రక్షణ విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి నగదు బహుమతితోపాటు సర్టిఫికెట్లు ప్రశంస పత్రాలను అందించారు. వ్యాసరచన పోటీలను డైట్ స్కూల్ ఉపాధ్యాయుడు నాగరాజు ఫిజిక్స్ సబ్జెక్టును విద్యార్థులకు బోధించారు. కార్యక్రమంలో క్లబ్ నెంబర్ శారదమ్మ, కెజిబివి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతి చెందిన గొర్రెలను చూసి విలపిస్తున్న బాధితులు

కుక్కల దాడిలో 28 గొర్రెలు మృతి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని కల్పనాయినిచెరువు గ్రామం, ముసలిరెడ్డిగారిపల్లె గంగిరెడ్డికి చెందిన గొర్రెల దొడ్డిలో నాలుగు కుక్కలు దాడి చేసి 28 గొర్రెలను చంపినట్లు బాధితుడు ఆవేదన చెందాడు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ ఊరి వెలుపల గొర్రెల దొడ్డిని ఏర్పాటు చేసుకొని గొర్రెలను అక్కడే ఉంచుకొని మోపుకునేవాడినని తెలిపారు. రోజూ మాదిరిగా గొర్రెలను అక్కడ వదిలి వెళ్లానని శుక్రవారం నాలుగు కుక్కలు దొడ్డిలోనికి చొరబడి 20 పెద్ద గొర్రెలను, 8 పిల్లలను కొరికి చంపివేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబానికి జీవనాధారమైన గొర్రెలను కుక్కలు చంపివేయడంతో అభాగ్యులకు మారాయని ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకున్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న సిడిపిఒ సాభాగ్యమ్మ

అంగన్వాడీ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వే కోడూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ సౌభాగ్యమ్మ శుక్రవారం మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెట్టిగుంట-1, సెట్టిగుంట-2,సెట్టిగుంట-3 సంబంధిత సూపర్వైజర్ గుణవతితో కలిసి సందర్శించారు. మధ్యాహ్నం చియ్యవరం సెక్టార్ సూపర్వైజర్ యశోదతో కలిసి రెడ్డిపల్లి-1, రెడ్డిపల్లి దళితవాడ, రెడ్డిపల్లి-అరుంధతి వాడ అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు అందించే పౌష్టికాహారం గురించి ఆరా తీశారు.

ఉపాధి పనులు కల్పించాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని సుండుపల్లి గ్రామపంచాయతీలోని చాకలపల్లె, కుమ్మరిపల్లె గ్రామాలకు చెందిన ప్రజలు తమకు ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు ఏడాదిగా ఉపాధి పనులు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులను దృష్టికి ఈ విషయం తీసుకెళ్లిన వారు పట్టించుకోలేదని అన్నారు. గ్రామాల్లో ఉపాధి పనులు లేక కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు పనులు కల్పించాలని కోరారు. గతంలో ఎంపిడిఒ దృష్టికి కూడా తీసుకెళితే పనులు కల్పించాలని సంబంధిత ఉపాధి ఎపిఒ సూచించారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధి పనులు చూపించి ఆదుకోవాలని కోరారు.

నేడు 'వైఎస్ఆర్ ఆసరా'

నిమ్మనపల్లె : వైఎస్ఆర్ ఆసరా నాలుగవ విడత నిధుల పంపిణీ, వాలంటీర్లకు వందనం కార్యక్రమాలు నేడు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ మైథిలి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) మైదానంలో ఏర్పాటుచేసిన నాలుగవ వైఎస్ఆర్ ఆసరా నిధులు డ్వాక్రా సంఘ సభ్యులకు పంపిణీ, వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, సంఘమిత్రలు, గ్రామ వాలంటీర్లు, డ్వాక్రా సంఘ సభ్యులు హాజరు కావాలని తెలిపారు.

ఎపిజిబి సిబ్బంది నిరసన

గాలివీడు : మండల పరిధిలోని నూలివీడ, గాలివీడులో ఉన్న ఎపిజిబి బ్యాంక్ సిబ్బంది శుక్రవారం సమ్మె నిర్వహించారు. గాలివీడు ఎపిజిబి బ్యాంక్ మేనేజర్ వెంకట్రావు మాట్లాడుతూ బ్యాంకులను జాతీయం చేయాలని బ్యాంకు సిబ్బంది, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. డిమాండ్లను పరిష్కరించి న్యాయం చేసే వరకు సమ్మెలు కొనసాగిస్తామని చెప్పారు.

క్రైం కార్నర్

పాతనేరస్తులు బైండోవర్ : సిఐ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల పరిధిలో పేకాట,అక్రమ మద్యం రవాణా, విక్రయాల కేసుల్లో 27 మంది పాత నేరస్తులను తహశీల్దార్ సమక్షంలో బైండోవర్ చేసినట్లు బి.కొత్తకోట సిఐ సూర్యనారాయణ తెలిపారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పోలీస్‌స్టేషను పరిధిలో నమోదైన పాత కేసులలో కర్ణాటక మద్యం అక్రమ రవాణా నిందితులు, నాటుసారా విక్రయదారులు, పేకాట రాయుళ్లు మళ్లీ ఎలాంటి నేరాలు చేయకూడదనే ఉద్దేశంతో ముందస్తుగా ఏదైనా పట్టదగిన నేరం చేస్తారేమోనని గుర్తించి బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కర్ణాటక మద్యం రవాణా, నాటుసారాతయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నిఘా మరింత కట్టుదిట్టం చేశామని వెల్లడించారు.